


సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 18 ఆగస్టు-సెప్టెంబర్, 2021 సంచిక : 3,4



**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)**
**ప్రచార సారథ్యం :**
**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech.
**శ్రీ బి. గోపీకృష్ణ**
**శ్రీమతి బులుసు జయ**


**సాయివాణి చందా వివరాలు**

ద్వైవార్షిక చందా. ......... రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥1000/-


**చిరునామా :-**

**సాయివాణి**

**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**


**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**


| విషయసూచిక | పుట సంఖ్య |
| --- | --- |
| మా వాణి | 2 |
| A Prayer | 4 |
| శ్రీ సాయి సచ్చరితము | 6 |
| సాయి సేవక్-శ్రీ శివనేశన్ | 8 |
| సాయిభక్త దాసగణు | 11 |
| శాశ్వత ధర్మగోప్త | 14 |
| బిందు వంటి బతుకు | 17 |
| ఆత్మ విచారం | 22 |
| మాతృసంస్థ కబుర్లు | 25 |


ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



సాయి భక్తులందరికీ సవినయ నమస్కృతులు.

మరో విజయదశమి వస్తున్నది. తొమ్మిది రోజులపాటు భగవద్ధ్యానం చేసిచేసి పదవ రోజున మహోత్సాహంతో ఉత్సవం జరుపుకోవలసిన రోజు విజయదశమి. ఈ పండుగ చుట్టూ అనేకానేకాలైన కథలు అల్లుకొని ఉన్నాయి. శ్రీరాముడు రావణ సంహారం చేసిన రోజనీ, అర్జునుడు (ఉత్తర గోగ్రహణ సందర్భంలో) కురుసైన్యాన్ని ఓడించిన రోజనీ, కాళీదేవి మహిషాసురుని మర్ధించిన రోజనీ రకరకాల విశ్వాసాలున్నాయి. సరే-మనకు-సాయీ భక్తులకు-శ్రీ సాయిబాబా వారు తమ దివ్యశక్తిని ఉపాధి (శరీరం) నుంచీ వేరుచేసి అనంత పరమశక్తిలో తిరిగి లీనం చేసి వేసుకొన్న రోజు గనుక గొప్ప తిథి -

తెలుగునాట కొన్ని ప్రాంతాలలో బాలికలు బొమ్మల కొలువులు తీర్చి దిద్దుతారు-నవరాత్రులలో. ఎన్ని వన్నెల బొమ్మలను-ఎన్ని వైనాలుగా, ఎంత సొగసుగా కొలువుతీర్చుతారు. నిరుటి బొమ్మలు కొన్ని శిథిలమైతే ప్రక్కకు పడెయ్యటం, క్రొత్త బొమ్మలు కొన్ని కొనటం, రంగువెలిసిన బొమ్మలను వెనక్కుంచి, మెరిసే బొమ్మలు ముందుంచటం-అచ్చం మానవ జీవితాలకు ప్రతీకల్లాగా అనిపిస్తాయి యీ కొలువులు. శరీరాల్లో సత్తువ నశించిన వృద్ధులు వెనుకబడిపోతే ఉత్సాహం ఉరకలెత్తే నవయువకులు ముందు నిలవటం సహజమే. అలాగే క్రొత్త బంధాలేర్పడుతూ ఉంటే పాతవి వదులై పోతుండటమూ చూస్తున్నదే.

చిన్న పిల్లలు కోతి బొమ్మలూ, కర్ర ధనుస్సులూ పట్టుకొని రంగురంగుల గులాల్ పొడి చల్లుతూ ఇల్లిల్లూ తిరిగి డబ్బులు తీసుకొనేవారు పూర్వ

కాలంలో. కోతి ఆంజనేయుడికి ప్రతీక. ఆంజనేయుడు గురు భక్తికీ, అచంచల దీక్షకూ ప్రతిబింబం. అంచేత శిష్యులైన వారందరూ హనుమంతుడిలాగే జీవించాలి. స్వామి (గురు) కార్యం సఫలమయ్యే వరకూ విశ్రాంతీ, ఆహారమూ మరిచిపోయిన మహనీయుడాయన. గురువు ఆజ్ఞను పాటించటంలో అంతటి త్యాగభరిత దీక్ష శిష్యులందరికీ ఉండి తీరాలన్నది చెప్పేందుకే ఆ కోతి బొమ్మలు పెట్టించటం. అతని సాయ ముంటే అధర్మంపై బాణం ఎక్కుపెట్టటం బహు తేలిక గదా!

నవరాత్రులు తొమ్మిది రోజులూ అమ్మవారికి వివిధ రకాల అలంకారాలు చేసి పూజిస్తారు. మహిషుడనే దుష్టుడూ, అహంభావీ అయిన రాక్షసుడిని దేవి సంహరించి వేసింది. ఇక్కడ మహిషుడు అధర్మమార్గంలో సంచరించే మానవులందరికీ సంకేతం. ఒళ్ళూ పైన తెలియకుండా ప్రవర్తించే వారిని "దున్నపోతులు" అని తిట్టటం ఉన్నదే గదా! అటువంటి వారిని అణగద్రొక్కి పారవెయ్యటం చైతన్య స్ఫూర్తి ఉన్న వారి కర్తవ్యం.

పై అన్నింటిలోనూ ఒక సారూప్యం కన్పిస్తుంది. శ్రీరాముడుగానీ, అర్జునుడుగానీ, హనుమంతుడుగానీ, దేవిగానీ అధర్మం మీదా, అహంభావుల మీదా తిరుగుబాటు చేశారు. ధర్మస్థాపనకై ఆ మహానుభావులు, ఆ మానవతా ప్రేమికులు, ఆ త్యాగమూర్తులు చేస్తున్న కృషికి, వారి చుట్టూ ఉన్న సమాజం అంతా దోహదం చేసింది. రామ కార్యానికి చంచల జీవులైన కోతులు చేతులు కలిపాయి. చివరికి చిన్నారి చిట్టి జంతువైన ఉడుత కూడా తనకు చేతనైన సాయం చేసింది. అందరి సహకారం ఒక్కటైతేనే అక్కడి పని నెరవేరింది. ఇవీ మనం గుర్తుంచుకోవలసిన విషయం. అందుకు చిహ్నంగానే మనం దసరా పండుగరోజు సాయంత్రం ఊరంతా ఒక్కటై ఊరేగింపుగా ఊరి బయట ఆరు బయలులో చేరి మన ఐక్యతను చాటుకుంటాము. అదే పారువేటగా (సీమోల్లంఘనం) స్థిరపడింది. జమ్మి చెట్లు పెరళ్ళలో పెంచరు. ఊరి బయటనే పెరుగుతాయి.





పాలపిట్ట కాస్త పిరికిది. ఊళ్లో తిరగదు. అంచేత జమ్మినీ, పాలపిట్టనూ చూడటం కోసం అన్న వంకతో ఊరందరూ ఊరి బయటకు వెళ్లటం అన్నది ఆచారంగా పెట్టుకున్నాం.

విజయదశమి వెనుక యిన్ని మహత్తరాలైన భావాలున్నాయి. వీటన్నిటినీ మించి - మన సాయినాథుల వారు స్వయంగా దేహాన్ని విడిచిన రోజు. తన శక్తిని శరీరంలోనుంచీ తీసి సమాధిలో నిక్షిప్తం చేసిన రోజు. "సర్వ జీవరాశిలోనూ నన్నే చూడండి" అన్న ఆ తండ్రి బోధ నిరంతరం స్మరించుకొంటూ, ఆ జీవరాశి క్షేమం కోసమై ధర్మరక్షణకై నిలిచిన మహనీయులకు మన అండదండలు అందిస్తూ, విశ్వకళ్యాణానికై మన వంతు సహకారం మనం అందిస్తూ ముందుకు సాగుదాం. శ్రీరాముని అభయ హస్త ముద్ర తన వీపున ముద్ర వేసుకొన్న ఉడతలలాగా సాయిరామ కరుణాన్విత దృష్టి ముద్ర మనపై నిరంతరం నిలిచేలా జీవిద్దాం.

# A Prayer

*- Pujya Sri Aurobindo*

Grant O Lord, that all shadows may be dispelled and that I may be more thy faithful servant in constancy and serenity. Before Thee my heart be pure as a pure crystal, so that wholly it may reflect Thee. O Lord, Eternal master, Thou shalt be the Teacher, the Inspirer. Thou will teach me what should be done ....

May something higher, nobler, more true be revealed to mankind, may a vaster and deeper love spread aborad so that all painful wounds may be healed.

O! Divine Master, grant that today may bring to us a complete consecration to Thy will, a more integral gift of ourselves to Thy work, a more total forgetfulness of self, a greater illumination, a purer love.

Grant that in a communion growing ever deeper more constant and entire, we may be united always more and more closely to Thee and become Thy servitors worthy of Thee.

Remove from us all egoism, route out all petty unity, greed and obscurity. May we be all ablaze with Thy divine Love ..... find time to sit quietly and go within ... and open that inner door .... give me Thy light, O Lord, grant that I do not fall into any error.

O Lord, eternal Master, Thou art my light and my peace, guide my steps, open my eyes, illumine my heart, and lead me on the paths that go straight to Thee. O Lord, grant that I may have no other will than Thine ..... and that all my acts may be an expression of Thy divine law.

Pure and disinterested love, Thy love in what we are able to perceive and manifest of it, is the sole key that can open all hearts that seek for Thee. In this love lie peace and joy, the fount of all strength and all realisation. It is the infalliable healer, the supreme consoler, it is the victor, the sovereign teacher. Thou who governest my life, kndle in my heart the flame of Thy pure love that it may burn like a glowing brazien, consuming all imperfections.







# శ్రీ సాయి సచ్చరితము

## నిత్య పారాయణ గ్రంథము
## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

### 1. ఆరంభము

కం. సంతుల చరితము వ్రాసిన
సంతసమొంది పరమాత్మ సాయము జేయున్.
అంతము జేయును పాపము
సొంతము నిను జేర్చుకొనును సన్నిధి కతడున్. 1

కం. ఆధ్యాత్మిక మార్గంబది
సాధ్యాసాధ్యములు జెప్ప సంతుల కైనన్
సాధ్యము కాదది నమ్ముడు
సాధ్యము సద్గురుని కగును సాధించంగన్. 2

ఆ.వె. సద్గురు సాయి నాధు శ్రావ్యపు పలుకులు
వేద వాక్కులనగ వింతగాదు
శ్రవణ మనన జేయ శాంతిని జేకూర్చు
సాయినాధ నీవె శరణు మాకు. 3

ఆ.వె. నీదు అహము విడచి నీల్గును పోద్రోలి
నీవె దిక్కు యనుచు నిలచి గొలువ
సాయి పాదములకు సాష్టాంగ పడగానె
సాయినాధ నీవె శరణు మాకు. 4

ఆ.వె. చరణ కమలములవి శరణు వేడిన వాని
భవము దీర్చి - యతని భవ్య లోక

ములకు జేర్చి - జనన ముక్తి నొసగు గాదె
సాయినాధ నీవె శరణు మాకు. 5

ఆ.వె. చర్చ వలన నిగ్గు సాధ్యము కాదేది
గురుడు పలుకు మాట గుండెనింపి
అహము వలన కలుగు ఆలోచనలు మాన
సాయినాధ నీవె శరణు మాకు. 6

ఆ.వె. ఇహము పరము నీకు ఇహలోకమున-కూర్పు
జేయ గలుగు సాయి-సేవ జేయ
తనువు మనసు పెట్టి తగురీతి నడువంగ
సాయినాధ నీవె శరణు మాకు. 7

సీ. రాముడు కృష్ణుడు రాలేద భువికిని
అవతార పురుషుడై ఆది విష్ణు
కొలువరే గురువుల కోర్కెలు దీరంగ
వాశిష్ఠ సాందీపు పాదయుగము
గురువుని వెదకెను గురుసేవ జేసెను
భారతీయులు చాల భక్తిగల్గి
ఉపదేశ సూత్రాలు ఉనికినే మార్చును
ఉన్నతునిగ జేయు యుర్మినందు

ఆ.వె. గురుడు లేకయున్న గురుతు పొందగలేవు
గురుని వెదకి కొలువు - గురుడు లేక
సాగలేవు నీవు - సాధించగాలేవు
సాయినాధ నీవె శరణు మాకు 8

**(సశేషం)**





## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

ఆ రాత్రి షిరిడీలోనే గడిపి తెల్లవారుఝాముననే నిద్రలేచి అభ్యంగన స్నానమాచరించి, చలువ వస్త్రములు ధరించి నారికేళమును చేబూని బాబా దర్శనార్థమై ద్వారకామాయి చేరుకున్నామె తన నాసికాభరణమును ఎవ్వరో దొంగిలించటం గమనించి దుఃఖపూరితురాలై నాసికాభరణము లేకుండా తన అత్తగారింట్లో అడుగుపెడితే తనను కాపురం కూడ చెయ్య నివ్వరని తలంచి తనకు మేలు చేసిన బాబానే దుర్భాషలాడసాగెను. “బాబా అమ్మా, నీ నాసికాభరణాన్ని ఎవ్వరూ అపహరించలేదు. అది నీ దగ్గరనే ఉన్నది” అనినను ఆమెకు బాబా మాటలయందు విశ్వాసము కుదరక విచార వదనయై, కన్నీటిని బలవంతముగా ఆపుకుంటూ ద్వారకా మాయిని వీడుతుంటే బాబా “అమ్మా, నా కోసం తెచ్చిన నారికేళమును నాకివ్వవా?” అని దానిని నేల మీద పగలకొట్టగానే ఆమె నాసికాభరణం అందులోనుంచి బయటకువచ్చింది. ఆ దృశ్యమును గాంచిన ఆమె విస్మిత వదనయై బాబాను అనవసరంగా ధూషించినందులకు బాబాను క్షమాపణ వేడి బాబా అనుమతి, ఊదీప్రసాదమును గైకొని అత్తవారింటికి చేరి తన అనుభవమును అచటి వారందరికీ తెలుపగా, అందరూ సంత సించి ఆమె అత్తింటి వారు సహితము బాబా భక్తులుగా మారిరి. ఈ లీలలోని అంతరార్థమును “బాబా తన భక్తులకు తనపై ఎంతటి విశ్వాస మున్నదో పది మందికి తెలియజేయుటకు అప్పడప్పడు పరీక్షలకు గురి చేస్తాడు. ఎంతటి విపత్తు సంభవించినా బాబా యందు భక్తి విశ్వాసములు సడలించక బాబానే నమ్ముకున్న వారు ధన్యుల”ని స్వామీజీ వివరించెను.

దాసగణు మహారాజ్ ఒక పర్యాయము బాబాను దర్శించి తనకు

గంగా యమునల సంగమంలో స్నానమాచరించవలెనన్న కోరికను వెలిబుచ్చి ప్రయాగ ప్రయాణమునకు అనుమతి నొసంగుమని వేడగా బాబా "గణూ ప్రయాగ స్నానం కొరకు ప్రయాసపడి అంతదూరం వెళ్ళాలా? అవి ఇక్కడ లేవా?"యని ప్రశ్నించగానే దాసగణు నిరుత్సాహముతో బాబా తనకు అనుమతి నొసంగలేదని తలంచి బాబా చరణములపై తన శిరస్సు నుంచి ప్రణమిల్లగా బాబా రెండు పాదముల బొటనవ్రేళ్ళ నుండి గంగా యమునలు ప్రవహించినవి. వింతలలోకే వింతయైన ఈ వింతను గాంచిన దాసగణు అచ్చెరువొందెను. అతని హృదయము ఆనందభరితమై కన్నుల నుండి ఆనందభాష్పములు రాలుచుండ అప్రయత్నముగా అతని నోటి నుండి సాయి లీలా సంకీర్తన రూపమున పరవళ్ళు త్రొక్కినది. దాస గణుకు మనమున బాబా ముస్లింయన్న అనుమానముండుటచే ఆ పవిత్ర తీర్థమును దోసిలిలోపట్టి కన్నులకద్దుకొని శిరమున జల్లుకొనెనేగాని ఆ తీర్థమును సేవించలేదు. కొంతకాలము తరువాత తన గురువును దర్శించుకొనగా ఆయన "బాబాను ముస్లిం అనుకొని ఆయన చరణాల నుండి ప్రవహించిన గంగా యమునల జలమును స్వీకరించక చేతికంద వచ్చిన ఫలమును చేజార్చుకున్నావు. ఎన్ని జన్మలెత్తినా నీకు ఈ అవకాశం మరలరాదు" అని మందలించగా దాసగణు తాను చేసిన తప్పిదమును గ్రహించెను. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్న చందమాయెను దాసగణు పరిస్థితి. దాసుగణు మనస్సెరింగియు బాబా గంగా యమున లను ఎవరి కొరకు షిరిడీకి రప్పించెనని స్వామీజీని ప్రశ్నించగా ఆయన "మానవులు తెలిసో తెలియకో అనేక పాపములు చేయుదురు. ఆ పాప ప్రక్షాళన కొరకు పవిత్ర నదులలో స్నానమాచరించి పునీతులగుదురు. యోగుల, పుణ్యచరితుల, పావనమూర్తుల పావన చరణ ధూళితో తమ పాప భారములను తొలగించుకుని పునీతమవుతాయి నదీమ తల్లులు. యోగులకే యోగి రాజు, పుణ్యమూర్తులకే పునీతుడు, సాక్షాత్తు పరబ్రహ్మ






సాయినాథుని చరణ ధూళి కొరకు నదీమ తల్లులు తహతహలాడుతుండ బాబా ఏనాడు షిరిడీ వీడకుండట, బాబా ఆజ్ఞ లేక ఎవ్వరూ షిరిడీ పుణ్య భూమిపై కాలిడలేరని గ్రహించిన నదీమ తల్లులు తాము షిరిడీకి వెళ్ళలేక బాబాను తమ చెంతకు రప్పించుకొనలేక మధనపడుచుండ బాబా "గంగా యమునల కొరకు అంతదూరం వెళ్ళాలా అవి ఇక్కడ లేవా?" యని దాసగణును ప్రశ్నించినను బాబా తమకు పరోక్షముగా షిరిడీ ప్రవేశానికి అనుమతి నొసంగెనని గ్రహించి వెంటనే అరక్షణమైనను ఆలస్యము చేయక, గంగా యమునలు షిరిడీ ప్రవేశమొనరించి బాబా పావన చరణముల చెంత ప్రవహించె"నని స్వామీజీ వివరించెను. దాసగణుని సాకుగా చేసుకొని గంగా యమునల కోర్కెను బాబా ఏ విధముగా తీర్చినది చదువరులు గ్రహింతురు గాక.

**వ్యాధులు బాపే ఊది :**

బాబా తనను దర్శించవచ్చిన భక్తులకు ఊది ప్రసాదాన్నిచ్చి ఆశీర్వ దించేవారు. బాబా ద్వారకామాయిలో ప్రజ్వలింపజేసిన నిత్య అగ్నిహోత్రం లోని విభూదియే "ఊది". ప్రతి నిత్యము మధ్యాహ్న హారతి అయిన పిదప భక్తులు వారి గృహములకు వెళ్ళునప్పుడును, షిరిడీ నుండి భక్తులు తమ స్వగ్రామములకు మరలునప్పడు బాబా వారికి ఊది నొసంగి ఆశీర్వదిం చెడి వారు. వ్యాధిగ్రస్తుల పాలట దివ్య ఔషధం ఈ ఊది. బాబా యందు సంపూర్ణ విశ్వాసముంచి ఊది సేవిస్తే అది సంజీవని కన్నా మిన్నగా పని చేస్తుంది. ఈ దివ్య ఊది మహోత్మ్యం అనేక గ్రంథాలలో వివరించబడినది.

ఒక పర్యాయము స్వామీజీకి పరిచయమున్న వ్యక్తి ఒకరు అరటి పండులో విషం కలిపి స్వామికి ఇవ్వగా స్వామి నాలుక కోస రెండుగా చీలి రక్తం స్రవించగా స్వామి జరిగినది గ్రహించి ఏ మాత్రము అధైర్య పడక భారమంతయు బాబాపై వేసి ద్వారకామాయి కేగి ఊదిని సేవించ గానే రక్తము స్రవించుట ఆగిపోయి గాయం కూడ మాయమైనది.

**(సశేషం)**



# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

**(గత సంచిక తరువాయి)**

"అదెలా కుదురుతుంది బాబా, ఆ ఉద్యోగం ఉండబట్టే నేను నా కుటుంబం రెండు పూటల భోజనం చేయగలుగుతున్నాము. అది వదిలేస్తే పరిస్థితి ఏంటి?" అని బాబాకు సమాధానమిచ్చేవాడు. అప్పుడు బాబా ఎంతో శాంతంగా, ప్రేమగా, "అరే గణూ! దాని గురించిన ఆందోళన నీకెందుకు? అంతా నేను చూసుకుంటాను. ఆ భగవంతునికి నీ పట్ల చాలా కలవరం ఉంది. నీవు చేయాల్సింది వేరే ఉంది. నా మాట విను. ఉద్యోగం వదిలేయ్" అని అనునయించి చెప్పేవారు. "నువ్వు అలాగే అంటావులే బాబా. నేను త్వరలో జరగబోయే ఫౌజ్‌దార్ (ఇన్‌స్పెక్టర్) పరీక్షకు కూర్చొంటున్నాను. అందులో ఉత్తీర్ణుడనై, ఆ ఫౌజ్‌దార్‌గా పదోన్నతి వచ్చి, కొన్నాళ్లు ఉద్యోగం చేసాక, అప్పుడు కావాలంటే వదిలేస్తాను" అని దాసగణు మాటదాటేసే ప్రయత్నం చేసేవాడు. "నీకు ఆ ఉద్యోగం రాదు. ఇప్పడే ఉద్యోగం వదిలేసేయ్" అని బాబా నొక్కి వక్కాణించేవారు. అయినాసరే, దాసగణు బాబా మాటలను తేలికగానే తీసుకునేవాడు. తన మానాన తాను పరీక్షకు సన్నద్ధం కాసాగాడు. దాసగణు కవితా సామర్థ్యం ఎంత గొప్పదంటే ఫౌజ్‌దార్ పరీక్ష పాఠ్యాంశమైన పోలీసుయాక్టునంతా తాను ఓవిల రూపంలో రాసుకుని పరీక్షకు సన్నద్ధం అయ్యాడు. ఇక చెప్పేదేముంది, పాఠ్యాంశమంతా కొట్టిన పిండిగా మారడంతో, పరీక్షలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. ఇక నామమాత్రమైన మౌఖిక పరీక్షకు హాజరై, పదోన్నతి పొందడమే తరువాయి. దాసగణు సంతోషంగా నానాసాహెబ్ చందోర్కర్ వద్దకు వెళ్లి "చూడండి నానాసాహెబ్, నేను కేవలం ఉత్తీర్ణుడవడమే కాదు, ప్రథమ





శ్రేణిలో వచ్చాను. బాబా నా వల్ల కాదని చెప్పారు" అని చెప్పాడు.

తరువాత కొన్ని రోజులకు వారిద్దరూ కలసి షిరిడీకి వెళ్లారు. బాబా వద్ద వారిరువురూ కూర్చొనియున్న సందర్భంలో దాసగణు మొహంలో తొణికిసలాడుతున్న సంతోషాన్ని చూసి, బాబా "ఏం గణూ! ఏమిటి విషయం. చాలా సంతోషంగా ఉన్నావు?" అని నర్మగర్భంగా నవ్వుతూ అడిగారు. దాసగణు సమాధానం ఇచ్చేలోపే, నానాసాహెబ్ బాబాతో "గణపతిరావు ఫౌజ్‌దార్ పరీక్షలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. ఇక ఫౌజ్‌దార్ అవుతాననే సంతోషంలో ఉన్నాడు" అని చెప్పాడు.

"ఒట్టి కాగితంపై ఉత్తీర్ణుడయితే ఉపయోగమేముంది? ఉద్యోగంలో చేరితే కదా! అరే గణూ! నా మాట విను. ఆ మాయలో పడకు. ఉద్యోగం వదిలేయ్" అని బాబా మరల తమ మాటను పునరుద్ఘాటించారు. దాసగణు యథాప్రకారం బాబా మాటలను యథాలాపంగా తీసుకోవడం చూసి, తనను సావధానుడిని చేయడానికి నానాసాహెబ్ తన వంతు ప్రయత్నం చేయసాగాడు. "చూడు గణపతిరావు, బాబా వంటి మహాత్ముల మాటలను పెడచెవిన పెట్టడం యోగ్యం కాదు. ఆయన చెప్పినట్లు చేయ్. కావాలంటే నీకు ఎంత జీతమొస్తుందో, అంతే మొత్తం ప్రతినెలా నేను నీకు ఇస్తాను ఇక నీకు ఇబ్బంది ఏముంది?" అని దాసగణుకి నచ్చచెప్పే ప్రయత్నం చేయసాగారు. కానీ, దాసగణు ఆ మాటలను కూడా లక్ష్యపెట్టకుండా మాట దాటవేసాడు.

అలా షిరిడీ వెళ్లిన ప్రతిసారీ బాబా, ఉద్యోగాన్ని వదలివేయమని ఒత్తిడి తీసుకు వస్తుండటంతో, దాసగణు షిరిడీకి రావడం తగ్గించివేసాడు. ఒక విధంగా బాబా కంటపడితే ఉద్యోగం వదలేయమని వెంటపడతారని, బాబా నుండి తప్పించుకు తిరగసాగాడు. నిజం చెప్పాలంటే అలా అని దాసగణు అనుకుంటున్నాడు. సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి అయిన ఆ సమర్థ సద్గురుని (కృపా) దృష్టి నుండి ఎవరు మాత్రం తప్పించుకోగలరు. ఒక చిన్న ఉదాహరణ.

ఒకసారి ఒక కేసు విచారణ నిమిత్తమై దాసగణు షిరిడీ గుండా వెళ్ల వలసి వచ్చింది. కానీ, షిరిడీలో ఆగి బాబా దర్శనానికి వెళితే, బాబా మరల ఉద్యోగం వదలివేయమని ఒత్తిడి తెస్తారని, షిరిడీలో ఆగకుండా వెళ్లిపోవాలని నిశ్చయించుకున్నాడు. బాబా ఎప్పుడూ లెండీకి రహదారి (నగర్-మన్మాడ్ రోడ్) మీదుగానే వస్తారు. మసీదు నుండి లెండీకి ఒక అడ్డదారి ఉన్నప్పటికీ బాబా ఆ మార్గాన్ని ఎన్నడూ ఉపయోగించేవారు కారు. చుట్టూ తిరిగి రహదారి మీదుగానే లెండీకి చేరుకునేవారు. తిరిగి వచ్చేటప్పుడు కూడా అదే దారిని ఉపయోగించేవారు. సన్నిహిత భక్తులలో కొందరు ఆయనకు గొడుగు పడుతూ, కొందరు ఆయన వెంట లెండీ వరకు వెళ్లేవారు. భక్తులు అక్కడ బయట వేచి ఉంటే బాబా ఒక్కరే లెండీకి వెళ్లేవారు. ఒక్కొక్కరోజు బాబా లెండీకి రెండు మూడు సార్లు వెళ్లేవారు. సరి!

నిత్యప్రకారం బాబా లెండీకి వచ్చే సమయం తన ఎరుకలో ఉండటంతో, ఆ సమయాన్ని తప్పించి, దాసగణు ఆ రహదారిలో షిరిడీ మీదుగా ప్రయాణించసాగాడు. ఆ రోజు బాబా మరలా ఆకస్మాత్తుగా లెండీకి బయలుదేరారు. సరిగ్గా బాబా రహదారి వద్దకు రాగానే దాసగణు గుర్రం మీద వస్తూ ఎదురుపడ్డాడు. ఊహించని విధంగా బాబా ఎదురుపడటంతో అవాక్కయిన దాసగణు గుర్రం దిగి బాబాకు ప్రణమిల్లాడు. "ఏం గణూ, ఉద్యోగం వదిలేసే సంగతి ఏమయింది? ఎన్నిసార్లు చెప్పినా ఇదిగో, అదిగో అంటూ మాట దాటేస్తున్నావు. సరే అలాగే కానీ, మంచిగా చెపితే నీ బుర్రకు ఎక్కడం లేదు. ఇక నువ్వే పశ్చాత్తాపపడతావు" అని కొంచెం గట్టిగా చెప్పారు. దాసగణు ఏమీ జవాబు చెప్పకుండా మౌనంగా నమస్కారం చేసుకుని తన ప్రవాసాన్ని ముందుకు కొనసాగించాడు.

తరువాత బాబా తాము చెప్పినట్లుగానే ఉద్యోగరీత్యా దాసగణుకి ఎన్నో రకాలైన సంకటాలను కల్పించి, ఎట్టకేలకు "నాకు వద్దు ఈ పోలీసు ఉద్యోగం" అనే మానసిక స్థితికి దాసగణుని తీసుకువచ్చి, చివరకు తనంతట తాను ఉద్యోగానికి రాజీనామా సమర్పించేటట్లు చేసారు. **(సశేషం)**





శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



**- రచన : భండారు సదాశివరావుగారు**

**(గత సంచిక తరువాయి)**

## 5. శ్యమంతకం

కంసుని అత్యాచారాలను, దౌర్జన్యాలను భరించలేక మధురను వదలి ఎన్నో ప్రముఖ కుటుంబాలు తమ బంధువులున్న పరిసర రాజ్యాలకు చరాస్తులను తీసుకుని వెళ్లిపోయాయి. కంస వధానంతరం ఆ కుటుంబాలన్నీ క్రమంగా మధురకు వచ్చిచేరాయి.

అందులో సత్రాజిత్తూ, అతని నాశ్రయించి ఉండే కుటుంబాలు అంగబలం, అర్థబలం గలవారు. సహజంగా వీరంటే, కంసుని అత్యాచారాలకు తలదించకుండా మధురలోనే ఉన్న కుటుంబాలకు చిన్నచూపు ఉండేది. క్షాత్రధర్మాన్ని అవమానించి, తప్పకు పారిపోయిన భీరువులుగా వీరిని చూస్తుండేవారు.

పాండవులు యాదవులకు మేనల్లుండ్లు. వారు ద్రౌపదీ సమేతంగా తిరిగి రావడం ఇంద్రప్రస్థలంలో రాజధాని నిర్మించుకొని, హస్తినాపుర రాజ్యంలో సగభాగం పొందడం ఒక గర్వకారణం అయింది. ఆ సందర్భంగా తమ సంపదలలో అయిదవవంతు పాండవులకు బహుమతిగా ఇవ్వడానికి నిశ్చయిస్తే సత్రాజిత్తు అతని అనుచరులు ఆ ప్రస్తావననే తిరస్కరించాడు. సత్యకుడు ఒక ప్రముఖ యాదవుడు. క్షాత్రధర్మాన్ని ఒక వ్రతంగా ఆచరించే మహా వీరవ్రతి. సత్రాజిత్తు అతని అనుచరులు కట్నంలో భాగం ఇవ్వనందువల్ల ఏర్పడ్డ లోటును సత్యకుడు, మిగతా యాదవులు తమ భార్యల ఆభరణాలను కూడా ప్రోగుచేసి, భర్తీ చేశారు.

శ్రీకృష్ణుడు ద్వారకను వదలి దాదాపు నాలుగేండ్ల పైన అయింది. తిరిగి వచ్చినప్పుడు అతనికి ద్వారకలో పరమోత్సాహకంగా స్వాగతం

పలికారు. ఆ స్వాగతానికి ఎలాంటి ఆభరణాలు లేకుండా యాదవ స్త్రీలు, పురుషులు రావడం శ్రీకృష్ణుడు గుర్తించాడు. అలా అనలంకృతులై రావడానికి గల కారణం ఆ తరువాత అతనికి తెలిసింది.

దానికి తోడు శ్రీకృష్ణ, బలరాములు లేని సమయాన తన అంగబలాన్ని, అర్థబలాన్ని చూచుకొని గర్వించి, యాదవ గణసంఘానికి ఉగ్రసేనుని బదులు తానే ప్రముఖుడనవుదామని సత్రాజిత్తు ప్రయత్నాలు ప్రారంభించాడు. ఆ అహంకారంతోటే శ్రీకృష్ణుడు తిరిగి ద్వారకకు వచ్చినప్పుడు అతని స్వాగతానికి సత్రాజిత్తుగాని, అతని కుటుంబసభ్యులుగాని, అతని అనుచర కుటుంబాల నుంచి గాని పెద్దలెవ్వరూ వెళ్లలేదు.

శ్రీకృష్ణుడు సత్రాజిత్తును సరియైన మార్గాన పెడదామనుకున్నాడు. సత్రాజిత్తు గర్వానికి మూలం శ్యమంతకమణి. ఆ శ్యమంతకాన్ని రాజ్యకోశానికి సమర్పిస్తే లోకకళ్యాణదాయకమవుతుందని ప్రబోధించాలని అనుకున్నాడు. ఆ ఉద్దేశ్యంతో సత్రాజిత్తును కలవడానికి వెళ్లిన శ్రీకృష్ణునితో సత్రాజిత్తు అహంకారంతో అసభ్యంగా, దుందుడుకుతనంతో ప్రవర్తించి, అతణ్ణి శాశ్వతంగా అవమానపరచి, యాదవగణాల దృష్టిలో కించపరచడానికి, 'శ్యమంతకాన్ని శ్రీకృష్ణుడు అపహరించాడ'ని నిందమోపి ప్రచారం చేశాడు. గణసంఘ సభలో ఈ వివాదాన్ని లేవనెత్తాడు.

శ్రీకృష్ణుడు తన వ్యక్తిత్వ మహత్తుకు, ప్రభావానికి అదొక సవాలుగా స్వీకరించాడు. శ్యమంతకాన్ని సాధించి తెచ్చి సత్రాజిత్తుకు గుణపాఠం నేర్పాలని నిశ్చయించుకున్నాడు. చివరకు శ్యమంతకం ఋక్షకుల నాయకుడైన జాంబవంతుని దగ్గర ఉన్నదని తెలుసుకున్నాడు. జాంబవంతుడు శ్యమంతకాన్ని తన కూతురు జాంబవతినీ శ్రీకృష్ణునికి సమర్పించాడు. ఈ ప్రయత్నంలో శ్రీకృష్ణునికి సత్యభామ, సాత్యకులు సహకరించారు.

శ్యమంతకాన్ని తెచ్చి సత్రాజిత్తుకు అప్పగించడంతో అతని అహంకారం పూర్తిగా నశించింది. సత్యభామ శ్రీకృష్ణుణ్ణి పరిణయమాడింది.





సత్రాజిత్తు బ్రతికి ఉన్న రోజుల్లో శతధ్వనుడనే యాదవవృష్ణి తన ఆటలో పావుగా ఉపయోగించుకుంటూండేవారు. సత్యభామను పెండ్లాడాలని శతధ్వనుని కోరిక. సత్యభామ శ్రీకృష్ణుణ్ణి వరించడంతో అతనికి మతి చలించింది. శ్రీకృష్ణుడు శ్యమంతకాన్ని తిరిగి సత్రజిత్తుకే ఇచ్చాడు.

శ్యమంతకాన్ని శ్రీకృష్ణుడు తిరిగి సత్రాజిత్తుకే ఇవ్వడం వృష్టి కులనాయకుడైన అక్రూరునికి నచ్చలేదు. శ్యమంతకాన్ని సాధించాలని అతని కోరిక. అతనికి శతధ్వనుడు ఉపకరణం అయినాడు. ఇద్దరూ తమ అనుచరులతో కలిసి కుట్రపన్నారు.

శతధ్వనుడు రహస్యంగా అర్ధరాత్రి దాడిచేసి సత్రాజిత్తును సంహరించి శ్యమంతకాన్ని అపహరించాడు. శతధన్వునికి శ్యమంతకాన్ని తన దగ్గరే ఉంచుకునే సాహసం లేదు. అక్రూరుడు కృష్ణునికి సన్నిహితుడు. కృష్ణునిలో మానవాతీత శక్తులను దర్శించుకునే భక్తుడే. అయినా ధనం పట్ల వ్యామోహం చావనివాడు. శతధ్వనుడు ఆ మణిని అక్రూరునికి ఇచ్చాడు. ఇది జరిగినప్పుడు బలరామకృష్ణులు హస్తినాపురంలో ఉన్నారు.

"నేను సత్రాజిత్తును చంపినట్లు రేపు అందరికీ తెలుస్తుంది. అదెలాగూ తప్పదు. కాని శ్యమంతకాన్ని నేను స్వాధీనం చేసుకున్నానని మాత్రం ఎవరికీ తెలియకూడదు' అని శతధ్వనుడు అక్రూరుణ్ణి కోరాడు. అక్రూరునికి శ్యమంతకం మీద ఎలాగూ దృష్టి ఉన్నది. 'అలాగైతే ఒక పని చేయవచ్చు. శ్యమంతకాన్ని నా దగ్గర ఉంచు' అన్నాడు అక్రూరుడు. శతధ్వనునికి ఆ సలహా నచ్చి, మణిని అక్రూరునికి అప్పగించాడు.

'నీవు కూడా శ్యమంతకం నా దగ్గర ఉన్నదని ఎవరికీ చెప్పకు. ద్వారకా నగరం, యాదవసేనతో సహా ఇప్పుడు నా స్వాధీనంలో ఉన్నది. తన మామ గారిని చంపినందుకు శ్రీకృష్ణుడు నీ మీదికి దాడి చేస్తే, మేమందరమూ నీకు సహాయపడతాం. నిన్ను రక్షిస్తాం' అని అక్రూరుడు శతధ్వనునికి వాగ్దానం చేశాడు.

**(సశేషం)**

# బిందువంటి బతుకు చిటికలోన చితుకు

మనిషి శాశ్వతమనుకొని, సుఖసారమనుకొని ప్రీతి పెంచుకుంటున్న 'జీవితం'పై జగద్గురువులైన శంకరాచార్యులు అద్భుతమైన వ్యాఖ్యానం చేశారు. కారణజన్ములుగా ఈ భువిపైన అవతరించిన ఆదిశంకరులు మానవశ్రేయస్సుకు ఉపయుక్తమైన ఉపదేశాలను అమృతగుళికలుగా అందజేశారు. అల్పాక్షరాలలో అనల్పమైన బోధసారాన్ని జోడించారు. లౌకిక మైన లంపటంలో కూరుకుపోయి, ఈ లోకంలో స్థిరంగా ఏదో వేల సంవత్సరాలు బతికేస్తామన్న పిచ్చి భ్రమలతో, అతి ప్రణాళికలు రచించు కుంటూ మూర్ఖులుగా మసలుకుంటున్న మానవులకు ఆయన 'భజ గోవిందం' రూపంలో హెచ్చరికలు చేశారు. ఒక్కొక్క శ్లోకాన్ని ఓ కొరడా దెబ్బలా తమస్సు నిండిన మనస్సుపై ఝుళిపించారు. కొన్నాళ్ళు యాత్రికుల్లా గడపడానికి ఈ లోకంలోకి అడుగుపెట్టామన్న సత్యాన్ని మరచిపోయి, స్థిర ఆసనాలు చేసుకునేందుకు, ఆస్తులు కూడబెట్టుకునేందుకు తాపత్రయ పడుతున్నాం; తుదకు మనమూ వెళ్ళిపోయే రోజొకటి వస్తుందని తెలుసుకో లేకపోతున్నాం. కష్టంగా ఉన్నా, ఈ కఠోర సత్యంతో మన కళ్ళు తెరిపించే ప్రయత్నం చేస్తూ ....

**నళినీదళగత జలమతితరళం తద్వజ్జీవిత మతిశయ చపలమ్ ।**

**విద్ధి వ్యాధ్యభిమాన గ్రస్తం లోకం శోకహతం చ సమస్తమ్ ॥**

అంటున్నారు ఆది శంకరాచార్యులు. తామరాకుపై ఉన్న నీటిబిందువులా మనిషి జీవితం కూడా అతి చంచలమైనది. ఈ సత్యాన్ని గుర్తెరుగక లోకంలో మనుష్యులు రోగాలతో బాధపడుతూ, దేహాభిమానాన్ని విడువక, దుఃఖంలో చిక్కుకొని ఉన్నా దేహాభిమానాన్ని విడువకున్నారు. ఈ విధమైన ప్రవర్తన వల్ల మనిషికి శాశ్వత సుఖమే లేదని తెలుసుకోమంటున్నారు





శంకరులు. ఈ సత్యం మనల్ని నిరాశలోకి నెట్టేసేందుకు చెప్పింది కాదు! వాస్తవమేంటో తెలుసుకొని మసలుకొమ్మని చేస్తున్న మేలుకొలుపు.

**ఎందుకిన్ని తాపత్రయాలు! :** మనం అనవసరంగా ఈ జీవితంపై పెంచుకుంటున్న మమకారం, ఈ శరీర సుఖాల కోసం పడుతున్న తాపత్రయం తగ్గించుకోమనే హితోక్తులివి. ఏ సుఖమూ శాశ్వతం కాదనీ, ఏ కష్టమూ కలకాలం ఉండదనీ మన మనస్సు అర్థం చేసుకుంటే, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉద్వేగానికి లోను కాదు! మనల్ని ఉక్కిరిబిక్కిరి చేయలేదు. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణులు అనేవారు - "ఎల్లప్పుడూ మృత్యువును జ్ఞాపకం చేసుకోవాలి. మరణించాక చేసేదేమీ లేదు. స్వగ్రామం నుంచి సమీప నగరానికి ఉద్యోగం చేయడానికి వచ్చినట్లుగా, ఏదో కొన్ని కర్మలు నిర్వర్తించడానికి ఈ లోకంలోకి వస్తాం. యజమాని తోటను చూడటానికి ఎవరైనా వస్తే తోటమాలి వారిని వెంటబెట్టుకొని 'ఇది మా తోట, ఇది మా తటాకం' అని ఆ వనమంతా చూపిస్తాడు. ఏదైనా పొరపాటు జరిగి నప్పుడు యజమాని, తోటమాలిని పని నుంచి తొలగించి వేస్తే, మామిడి చెక్కతో చేసిన తన పెట్టె కూడా తీసుకుపోయే అధికారం అతడికి ఉండదు".

పుత్ర మిత్ర బాంధవులంతా సహచరులే కానీ శాశ్వతం కాదనీ; ఇల్లూ వాకిలీ, ఆస్తి అంతస్తులంతా మనం అద్దెకు తీసుకున్న వసతి సౌకర్యాలే కానీ వాటికి మనం సంపూర్ణ యజమానులం కామనీ, వెంట వచ్చేవి కావనీ గుర్తుంచుకోవాలి. ఈ మర్మం తెలియకే మనలో చాలామంది జీవితాన్ని సంక్లిష్టం చేసుకుంటున్నారు. వేదాంతంలో తామరాకు, నీటి బిందువుల సాహచర్యం గురించి అద్భుతంగా వివరిస్తారు. నీటిలోనే పుట్టి పెరిగి, నీటితోనే నిరంతరం సంబంధం కలిగి ఉంటుంది తామరాకు! కానీ ఆ నీటితో మమేకం కాకుండా, తడిసిపోకుండా, నిర్మలంగా తేలియాడుతుంది. అలాగే స్థితప్రజ్ఞుడు, జ్ఞాని, యోగి, గుణాతీతుడు అయిన

వ్యక్తి కూడా ఈ సంసారంలో ఉంటున్నా దానికి బందీ కాడు! చలించడు. ప్రయత్నం చేస్తే అందరికీ ఈ స్థితి సాధ్యమే!

**భ్రమల వల్లే బాధలు :** ఆధునిక సమాజంలో తీరిక లేని వ్యవహారాలు మనల్ని మరింత అహంకారపూరితుల్ని చేస్తున్నాయి. మనం లేకపోతే ఈ ఇల్లేమైపోతుందో, ఈ పిల్లలేమైపోతారో అన్న ఆందోళనలో పడేస్తున్నాయి. ఈ ప్రపంచం స్తంభించిపోతుందేమోనన్న భ్రమలు కల్పిస్తున్నాయి. నిజానికి ఈ లోకానికి ఏ ఒక్కరి అవసరమూ లేదు! మనం కాకపోతే ఇంకొకరు, ఆ పాత్రను పోషిస్తూనే ఉంటారు. అందుకే శ్రీ కాళహస్తీశ్వర శతకంలో అంటారు మహాకవి ధూర్జటి.

**తరగల్ పిప్పల పత్రముల్ మెఱగు టద్దంబుల్ మరుద్దీపముల్**

**కరికర్ణాంతము లెండమావుల తతుల్ ఖద్యోత కీటప్రభల్**

**సురవీధి లిఖితాక్షరంబు లసువుల్ జ్యోత్స్నాపయః పిండముల్**

**సిరులందేల మదాంధులౌదురు జనుల్, శ్రీకాళహస్తీశ్వరా!**

ప్రాణాలు నీటి అలల్లా, రావియాకుల్లా, మెరుపులతో చేసిన అద్దంలా, గాలిలో పెట్టిన దీపంలా, ఏనుగుల చెవుల కొనల్లా, ఎండమావుల్లా, మిణుగురు పురుగుల కాంతుల్లా, ఆకాశంలో రాసిన అక్షరాల్లా భ్రాంతిచే కల్పించబడ్డాయి. అవన్నీ అవాస్తవాలు, క్షణికాలు, చంచలాలు! ఇక సంపదలు మంచునీటి బిందువులు లాంటివి. ఎప్పుడు కరిగిపోతాయో, ఎప్పుడెలా తరిగిపోతాయో తెలియదు. మరి మనుష్యులు వాటిల్లో మునిగి, ఎందుకలా మదంతో కన్నూమిన్నూ కానని అంధుల్లా, అజ్ఞానుల్లా ప్రవర్తిస్తు న్నారో చెప్పజాలకున్నానంటూ ఆ శ్రీకాళహస్తీశ్వరుడి ముందు వాపోతాడు. వయసు మీద పడినా, మనలో చాలామందికి ఈ భ్రమలు తొలగక పోవడం బాధాకరం.

**యావ తీరని యయాతులు :** 'జీవితం మున్నాళ్ల ముచ్చటే కదా! అంత





మాత్రానికి వేటినీ అనుభవించకుండా, వృథాగా గడిపేయడం ఎందుకు? తనివితీరా సుఖసంపదల్లో తేలిపోదాం! సంబరాలు చేసుకుందాం!' అనే వితండవాదులూ లోకంలో ఉంటారు. కానీ, ఈ భౌతిక సుఖకాంక్ష అంత త్వరగా వదిలేది కాదు. ఎంత తీర్చుకున్నా, మరింత కావాలనిపిస్తుంది. ఒక దాన్ని మించి, మరొకటి వేయింతలు వెర్రెక్కిస్తుంది. చివరకు ఈ మనస్సు ఆ విషయ వాసనల రంగులో మునిగి ముద్దయిపోతుంది. అదే సంస్కారాలతో, కోర్కెల పుట్టతో మరో జన్మనెత్తుతుంది. నెయ్యితో నిప్పను ఆర్పడం ఎంత అమాయకత్వమో, కోర్కెలను తీర్చుకోవడం ద్వారా వాటిని సంతృప్తి పరచాలనుకోవడం కూడా అంతే అమాయకత్వం. ఈ చిన్న జీవితంలో ఇతర జీవుల్లా మనం కూడా సుఖలాలసతో దేహాభిమానానికే పరిమితమైతే, కొడుకు యౌవనాన్ని తీసుకొని అనుభవించినా, సంతృప్తి చెందని యయాతి మహారాజులా మిగిలిపోతాం. పశుపక్ష్యాదులతో సమానమైపోతాం! ఇదే హెచ్చరికతో శ్రీరామచంద్రుడు ....

**తరవోపి హి జీవన్తి, జీవన్తి మృగ పక్షిణః ।**

**స జీవతి మనో యస్య మననేన సజీవతి ॥**

అంటాడు యోగ వాసిష్ఠంలో! వృక్షాలు, మృగాలు, పక్షులు కూడా జీవిస్తు న్నాయి. కానీ ఏం లాభం? ఎవరికైతే, ఈ దృశ్య సంకల్పపు మననం క్షీణి స్తుందో, అలాంటి మనస్సు కలవారే, జీవితాన్ని అనుభవిస్తున్నారని స్పష్టం చేస్తాడు. ఈ జీవితంపై, ఈ దృశ్యప్రపంచంపై సరైన అవగాహన కలిగి ఉండాలి. అలాంటి భావనలతో జీవితాన్ని తీర్చిదిద్దుకోవడం వల్లే, శ్రీరాముడు లోకాభిరాముడయ్యాడు.


**అన్నీ తెలిసినా అదే ధోరణి :** జీవితంలో ప్రతీ ఒక్కరికీ ఏదో ఒక సమ యంలో వైరాగ్యభావన పొడసూపుతూనే ఉంటుంది. కానీ, అది శ్మశాన వైరాగ్యంలా కొంతసేపే! దగ్గర వారు కన్నుమూసినప్పుడో, కష్టాలు కమ్మేసి

నప్పుడో కాస్తంత వైరాగ్యపు మాటలు మాట్లాడేస్తారు. తరువాత యథాస్థితి! మళ్ళీ పరుగులు, పోరాటాలు! భగవంతుడు మనం మారేందుకు ఎన్నోసార్లు అవకాశం కల్పిస్తాడు. దానికి అనుకూలంగా ఎన్నో పరిస్థితులు కల్పిస్తాడు. కానీ, మనం ఒక్క క్షణం కూడా అటువైపు మనస్సును మరల్చే ప్రయత్నం చేయడం లేదు. కళ్ళ ముందు ఇన్ని వ్యాధులు, విషాదాలు చూస్తూ కూడా మనలో ఈ శరీరానికి సంబంధించిన ఆశలు చావడం లేదు. అదే భావనతో ఇక్కడ శంకరాచార్యులు **'విద్ధి వ్యాధ్యభిమానగ్రస్తం లోకం శోక హతం చ నమస్తమ్...'** అంటున్నారు. ఎంత శోకం అనుభవిస్తున్నా, ఇంకా ఎన్నో సుఖాలు అనుభవించాలనే తపన! మనుష్యుల ఈ అవస్థలు చూసి, ఆనాడే పరీక్షిత్తు మహారాజుతో శుకమహర్షి -

**పశు కళత్ర పుత్ర బాంధన దేహాది**
**సంఘమెల్ల తమకు సత్యమనుచు**
**కాపురములు సేసి కడపట చత్తురు**
**కలియుగాన రంత్య కాలసరణి ....** అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. సంసారంలో మునిగితేలుతున్న గృహస్థులకు ఆత్మతత్త్వం కొంచెం కూడా తెలియదు. పశువులు, భార్యలు, బిడ్డలు, చుట్టాలు, శరీరం ఇత్యాది పరివార మంతటినీ నిజమని నమ్ముకొని కాపురాలు సాగిస్తూ, సాగిస్తూ కడకు కన్నుమూసి కాటిపాలవుతారు. అంత్యకాల దుర్దశ తెలిసినా తెలియనట్లే ఉండిపోతారంటూ నిట్టూర్చారు. శంకరులు చెప్పినా, శుకమహర్షి చెప్పినా ఒక్కటే! మనం శాశ్వతంగా ఇక్కడ ఉండిపోవడానికి రాలేదు! ఆ పరమ సత్యాన్ని తెలుసుకొని మసలుకుంటే, ఇన్ని లంపటాలు ఉండవు. ఇన్ని సమస్యలూ సృష్టించుకోము.







# ఆత్మ విచారం

**- భగవాన్ శ్రీ రమణ మహర్షి**

**(చిక్కాల కృష్ణారావుగారి గ్రంథం నుంచి)**

మనలో నిరంతరం 'నేను-నేను' అంటో అవిచ్ఛన్నంగా వున్నదేదో, అదే 'ఆత్మ', అది అనంతం-అపారం-అఖండం-అవినాశి దాంట్లోంచి 'నేను' అనే ప్రత్యేక తలంపు-అదే వ్యక్తిగతమైన "నేను" (జీవుడు) పుడుతుంది. అదే "అహం". అది జడమూ కాదు, చైతన్యమూ కాదు. కాని, అది చైతన్య వంతమైన ఆత్మనూ, జడ దేహాన్ని కలుపుతుంది. అందుచేత ఆ అహంలో అటు చైతన్యం ఇటు జడలు రెండూ ప్రతిఫలిస్తాయి. నీటి బుడగగా వున్నంత సేపూ, అది ప్రత్యేకంగా నిలుస్తుంది. బ్రద్దలై, నామ రూపం లేకుండా నీటిలో కలుస్తుంది. బుడగలు అనంతం. నీరు ఒక్కటే! అవి ఒక దానికొకటి సంబంధం వుండవు. కాని, నీరు-బుడగ ఒకే నీరు.

జీవుడు లేక అహంకరణ లేక వ్యక్తి - నిద్రావస్థలో హృదయంలో వుంటాడు, మేల్కొగానే మేధస్సులో ప్రవేశిస్తాడు. దాని విచిత్ర శక్తే, మనస్సు, ఆ మనసు ఆలోచనామయం. అంటే, తలపుల, భావాల, సంకల్పాల మయం. మనసుకు అవే ఆధారం. అవి లేకపోతే, మనసు లేదు. కాని, గాఢనిద్రలో సంకల్పాలు, భావాలు, తలుపులు ఏమీ వుండవు. ప్రపంచమూ వుండదు. మేల్కొగానే 'నేను' అనే తలంపు పుడుతుంది. దానితో దేహ స్ఫురణ కలుగుతుంది. ఆ వెంటనే మనసు క్రీడ ఆరంభమౌతుంది. తత్ఫలితంగా సర్వేంద్రియాలు పనిచేయనారంభిస్తాయి. ప్రపంచమూ గోచరమౌతుంది. సంబంధాలు ఏర్పడతాయి. మనసు-దేహేంద్రియాలు కలిసి పనిచేయడంతో మనం మేల్కొన్నాం అనుకుంటాం.

నిద్రలో లోకం లేదు. మేల్కొగానే ఆలోచనలు ఆరంభమౌతాయి. ప్రపంచం ఎదురౌతుంది. నిద్రలో దేహం, ప్రపంచం లేకపోయినా, మనం

ఉంటాం. అంటే, మెలకువలో వున్నట్లుగానే 'నేను' వుంటుంది. తేడా ఏమిటంటే, మెలకువలో దేహస్ఫురణ వుంటుంది. అందుచేత దేహమే, 'నేను' అనుకుంటాం. అదే దేహాత్మ బుద్ధి, అది దుఃఖ కారణం.

ఆ 'నేను' ఎక్కడ పుడుతుందో తెలుసుకోవాలి. మనసు-'నేను' అనే ప్రత్యేక వ్యక్తిత్వాన్ని సృష్టించుకుని, దేహంతో తాదాత్మ్యం చెంది. అసలు వున్న దానికి భిన్నంగా ప్రవర్తిస్తుంది. బైట చెడ తిరిగి 'నేను అజ్ఞానిని, పాపిని, అవివేకిని, పనికిమాలిన దానిని అని మనసు అనుకుంటూ అశాంతిగా కొట్టుకుంటుంది. మనసు స్వభావమే అది.

మనసు తాను కల్పించుకున్న దాన్ని వాస్తవంగా తీసుకుని, దాని వెనుక నున్న అసలు సత్యాన్ని ఒదిలేస్తుంది. పేపరు మీద అచ్చయిన అక్షరాల్ని చదివి, అసలు పేపర్ని ఉపేక్ష చేసినట్లు.

బైట ఏదైనా ఒకటి కొత్తగా కనిపించిందంటే, అది తప్పక అదృశ్య మౌతుంది. ఏదైనా ఒకటి నిర్మాణం అయిందంటే, అది తప్పక నాశన మౌతుంది. బైట కనిపించేవన్నీ, వాటి అంతాన్ని మోసుకుంటూ ఉంటాయి.

ఉన్నది మనం. మనమే అంతా. మనమే ఆత్మ. దాన్ని ఏ పేరుతో అయినా పిలవవచ్చు. అదే అసలు సత్యం. దాన్ని తెలుసుకోవడమే, అంతిమజ్ఞానాన్ని తెలుసుకోవడం.

'నేను నువ్వు' అంటే దేహం ఒక్కటే కాదు. నీ దేహం, ప్రపంచం, దాన్ని మార్గాలు అన్నీ నీలో ఉన్నాయి. నువ్వు వాటిల్లో లేవు. కాని నువ్వు వాటిల్లో ఒకటి. నువ్వు దేహాత్మ బుద్ధి వదలితే, దేహం-దాని కదలికలూ నిన్ను ఏ మాత్రం చలింపచేయవు, చేయలేవు.

"నువ్వు" అంటే, దేహమంతా నువ్వు కాదు. నువ్వు దేహమంతా వ్యాపించినా, ఒక కేంద్రం నుంచే ఆలోచనలు పుడతాయి. అవి తిరిగి అక్కడే అణగుతాయి. ఆ కేంద్రమే హృదయం. అది కేవలం దేహం మధ్య భాగమని కాదు. కాని, అదే ఆత్మ, దానికి మరో పేరే హృదయం.





"నువ్వు" నీరు మాదిరిగా వున్నావు. ఈ సమస్త చరాచరం నీపై తేలియాడే నీటి బుడగలు, నీరు లేకుండా అవి నిలవలేవు, నీరు లేకపోతే, వాటికి ఉనికే వుండదు. అంటే, నువ్వు లేకపోతే, ఏమీ లేదు. అవి నీరు వంటివి కావు. ఆ రహస్యం తెలుసుకుంటే, సందేహాలే వుండవు.

జడమూ, పరిమితమూ, అశాశ్వతమూ అయిన దేహం. "నేను" అనరు. అపారం-అనంతం-శాశ్వతం-చైతన్యవంతం అయిన ఆత్మ 'నేను' అనరు. అయితే 'నేను' అనేది ఎవరు? చేతనానికీ, అచేతనానికీ మధ్య ఈ 'నేను', ఒక ముడిగా వుంటుంది అంటారు కొందరు. అజ్ఞానం వల్ల అబద్ధపు భ్రాంతులూ; తరతరాల నుంచి వచ్చే విషతుల్యమైన వాసనలూ, అలవాట్లూ కలసి మనలో ఒక ముడిగా ఏర్పడతాయి. ఆ ముడి, బైట లేదు. బైట వుంటే, దాన్ని ఏదో విధంగా విప్పవచ్చు. లోపల వుంది గనుకనే, దాన్ని ఎవరికి వారు తెంచుకోవాలి.

ఆ ముడి భ్రూమధ్యలో వుంటుందంటారు మరికొందరు, ఇంకొందరు ఇంకోచోట అంటారు. వాళ్లంతా దేహాన్ని దృష్టిలో పెట్టుకొని చెపుతారు. గట్టిగా యోచిస్తే, ఈ దేహం కూడ "నేను" అదే ప్రథమ తలంపు ద్వారా ఏర్పడినదే కదా! ఆ సంగతి మరుస్తారు. ఆ ముడీ హృదయ గ్రంధి. ఆత్మ సాక్షాత్కారానంతరం ఆ గ్రంథి తెగిపోతుంది అంటారు.

నువ్వు ఏ రకం సాధన చేసినా ధ్యానం-ఆరాధన ఏదైనా కాని, అది అహంతో కూడినదే! సాధనతో అహం పోగొట్టుకోవడమే ముఖ్యం. "నేను కర్తను" అనే భావం పోవాలి. చేసేది వైరాగ్యభావంతో చేయాలి. వైరాగ్య మంటే, అనాసక్తత సమత్వం-వాంఛారహితం-నిర్మలం-నిశ్చింత-నిశ్చయ మైన మనసు. వాంఛా-మమకారం మనస్సుకు చెందినవి. మనసు అదుపులో వుంటే, అవి అణగిపోతాయి. అదే వైరాగ్యం. "విచారణే, వైరాగ్యానికి దగ్గర దారి" అన్నాడు స్వామి.

# మాతృసంస్థ కబుర్లు

ఆషాఢమాసంలో వచ్చే గురుపూర్ణిమనే వ్యాస పౌర్ణమి అంటారు. ఆ రోజు చాలా పరమపవిత్రమైనది. సాయిధామం ఆశ్రమంలో పౌర్ణమికి భక్తులు వేల సంఖ్యలో బాబా వారిని, గురుదేవులను దర్శించుకుంటారు. గురుపూర్ణిమ ముందు రోజే ఆశ్రమం అంతా పండుగ వాతావరణం నెలకొంది. ఆశ్రమ సేవ, గురుసేవ కోసం భక్తులు దూరతీరాల నుంచి వచ్చి కార్తకర్తలుగా, అన్ని పనులు చేయసాగారు.

జూలై 24 ప్రభాతవేళ 5.10 కాకడహారతి 6.30కి బాబా వారికి, దత్త స్వామికి, క్షీర, జలాభిషేక కార్యక్రమం జరిగాయి. 9.00 గం.లకు సాయినాథుల వారికి అష్టోత్తర శత నామ పూజ జరుగుతుండగా -

మరోప్రక్క జ్ఞానధామంలోని పూజ్య గురుదేవుల పాలరాతి విగ్రహానికి క్షీరాభిషేకం అనంతరం అలంకరణ పూర్తయి పూజ మొదలయ్యింది. ప్రధాన పూజలు పూర్తయ్యే సమయానికి భక్త జనులతో దేవాలయం నిండి పోయింది. సమయం 10.30 అయ్యింది. బాబా వారికి జరగబోయే సహస్ర నామార్చన కోసం వారి గోత్ర నామాలను నమోదు చేయించుకుంటు న్నారు. వన్నెవన్నెల పుష్పాలతో సాయినాథుల వారికి సహస్ర నామార్చన మొదలయ్యింది. దేవాలయం అంతా ఓంకార నాదంతో ధ్వనించింది. అందరి హృదయాలలో ఒకటే ఆలోచన ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న కరోనా మహమ్మారి నుంచి కాపాడు తండ్రీ అనీ భక్తితో వేడుకున్నారు. కరోనా సమయంలో కూడా 700 మంది దాకా వచ్చి బాబా వారి ఆశీస్సులు పొందారు.

అనంతరం పూజ్య గురుదేవులకు గురుపాదుకా పూజ ఎంతో సుందరంగా అలంకరించిన సింహాసనంలో గురుదేవులు ఆశీనులు కాగా పూజా కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది.





అటుపైన శ్రీశ్రీశ్రీ రామానంద ప్రభుజీ వారు గురుపూర్ణిమ వైశిష్ట్యాన్ని, వ్యాసుల వారి గొప్పతనాన్ని, గురుభక్తిని, గురుసేవ చేయవలసిన రీతిని గురించి వివరించి, సమాజ సేవయే గురుసేవగా భావించాలనీ గురుదేవుల అభిమతం కూడా అదే అని వివరించారు.

అనంతరం బాబా వారికి మహా హారతి, భక్తులంతా అన్నప్రసాదాన్ని స్వీకరించి సంతోషంగా తరలి వెళ్లారు.

ఈ కార్యక్రమానికి ఆర్థికంగా, హార్దికంగా సహాయ సహకారాలు అందించిన వారందరికీ పూజ్య గురుదేవుల పరిపూర్ణ ఆశీస్సులు ఎల్లప్పడూ ఉండాలనీ సాయివాణి మనసారా కోరుకుంటుంది.

ఆగస్టు 13వ తేది నాగారం మున్సిపాలిటీ పరిధిలోనే 17వ వార్డు సత్యనారాయణ పురం కాలనీ శ్రీ రమా సత్యనారాయణ స్వామి, శ్రీ షిరిడీ సాయిబాబా దేవస్థానం 13వ వార్షికోత్సవ సందర్భంగా ఆలయ కమిటీ వారు సాయిధామం ఆశ్రమ పీఠాధిపతులు అయిన శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద ప్రభుజీ వారి సమక్షంలో ధ్వజారోహణ, పూజా కార్యక్రమం ఘనంగా జరిగాయి. తదుపరి స్వామీజీ వారు ప్రవచిస్తూ-దేవాలయాలు సంస్కార కేంద్రాలనీ వివరిస్తూ సాయితత్త్వమే సమాజానికి శరణ్యమని వివరించారు.

ఆగస్టు 15వ తేది భారత స్వాతంత్ర్య దినోత్సవం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సం.లు అయ్యింది.

కరోనా మహమ్మారి కారణంగా సంవత్సరన్నర కాలంగా పాఠశాలలు మూతపడ్డాయి. చదువులు ప్రశ్నార్థకంగా మిగిలాయి. పరిస్థితులు ఎలా ఉన్నా దేశం, ధర్మం కలిసి నడవాలి. శ్రీ సాయి విద్యాధామం పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందురోజు పాఠశాలను శుభ్రం చేసి అలంకరణలు ఏర్పాటు చేసుకొని ఆగస్టు 15న ఆనందోత్సా హాలతో పతాకావిష్కరణ ట్రస్టు మెంబరు శ్రీమతి బి. జయగారు ఆవిష్కరించారు. పాఠశాల కరస్పాండెంట్‌గారు డా॥ చంద్రారెడ్డిగారు

మాట్లాడుతూ - ముందు తరాల దేశ భవిష్యత్తు ఎలా ఉండాలో విద్యార్థులకు వివరించారు. డబ్బులు పుచ్చుకొని ఓటు వేసి నాయకుడిని తెచ్చుకుంటే ఏనాటికీ దేశం బాగుపడదు. మనం నిర్మించుకున్న రాజ్యాంగం చక్కగా నడవాలంటే నాయకులు సరైనవారు ఉండాలి. ఈ దేశం నాది, నీతి-నిజాయితీగా పనిచెయ్యాలి అనే భావన ఉండాలనీ విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉపన్యాసాన్ని ముగించారు.

ఆగస్టు 20 వరలక్ష్మీ వ్రతం, శ్రావణమాసం శుక్ల పక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని వరలక్ష్మి వ్రతంగా జరుపుకోవటం హిందూ ఆచారం. వరలక్ష్మి దేవిని పూజిస్తే అష్టైశ్వర్యాలు లభిస్తాయని ప్రగాఢ విశ్వాసం.

సాయిధామం ద్వారవతి సాయి దేవాలయం మండపంలో వరలక్ష్మి దేవి నిండు ముత్తైయిదవలా ఆశీనురాలై కాంతులీనుతున్నదా రూపం. సాక్షాత్తూ అమ్మవారే వచ్చి వీక్షిస్తున్నట్లు అనిపించింది. 20వ తేదీ ఉదయం 10.00 లకు దేవాలయం ముత్తైయిదువలతో నిండిపోయింది. 60 మంది ముత్తైయిదువలు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అమ్మవారి వ్రతాన్ని ఆచరించారు. స్వామీజీ వ్రత కథను కళ్లకు కట్టినట్లుగా వివరించారు. తల్లి గొప్పతనాన్ని చెప్తుంటే అక్కడి తల్లులకు కళ్ళు చమర్చాయి. తల్లులందరూ ఇంటి ఆడపిల్లను ఎలా పెంచాలో వివరించి మన సంప్రదాయాలను, ఆచారాలను పిల్లలకు చెప్తుండాలనీ వివరించి, పాశ్చాత్య సంస్కృతిని విడనాడాలని చెప్పారు.

తదుపరి ముత్తైయిదువలంతా వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించి సెలవు తీసుకున్నారు.

ఆగస్టు 22న రక్షా బంధన్. దీనినే రాఖీ పౌర్ణమి లేదా జంధ్యాల పూర్ణిమ అంటారు. అన్నా చెల్లెళ్ళు, అక్కా తమ్ముళ్ళ మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకునే పండుగ ఇది. సాయిధామం ఆశ్రమంలోని అక్కలు వారి తమ్ముళ్ళకు రాఖీలు కట్టి మీరు మాకు రక్ష, మేము మీకు రక్ష,





మనిద్దరం దేశానికి రక్ష అని చెప్పకుని నోరు తీపి చేసుకున్నారు. ఉదయం గం.11.00 లకు దేవాలయంలో సాయినాథుల వారి వ్రతం ఎంతో చక్కగా జరిగింది.

ఆగస్టు 24 పూజ్య మాతాజీ పంచమ ఆరాధనోత్సవం, స్ఫూర్తి ధామంలోని అమ్మకు ఉదయం గం.6.30 లకు క్షీరాభిషేకం, ప్రత్యేక అలంకరణ జరిగాయి. 10 గం.లకు ఆశ్రమవాసులు, భక్తులు వారి శిష్యులు అందరూ అమ్మను పూజించి ఆశీస్సులు అందుకున్నారు.

పూజ్య గురుదేవులు మాట్లాడుతూ ఈ ఆశ్రమం కోసం ఎంతో శ్రమించి సర్వస్వం నా గురుదేవులే నాకు వేరే ఏది లేదు అని ఎలా పనిచేసారో ఆ సర్వ సమర్పణ భావాన్ని మనందరం అలవరచుకోవాలి. తల్లిగా, ఉపాధ్యాయురాలిగా, వక్తగా, కార్యకర్తగా అన్ని పాత్రలు పోషించి సాయి ధామాన్ని ఉన్నత స్థాయికి తెచ్చారు పూజ్య మాతాజీ. వారి అడుగుజాడలలో నడవడమే వారికి మనం ఇచ్చే నిజమైన నివాళి. అనంతరం -

సాయి విద్యాధామం పాఠశాల ఉపాధ్యాయులకు పూజ్య మాతాజీ పేరుతో వస్త్రదానం జరిగింది. వచ్చిన భక్తులంతా మాతాజీ జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని కన్నీటి పర్యంతం అయ్యారు.

### శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమం-సత్తెనపల్లి శాఖ

శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమంలో ఆనంద సాయి ప్రభు మందిరంలో పరమ పూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదా నంద ప్రభుజీ వారి ఆధ్వర్యంలో సాయినాథుల వారు ప్రతిష్ఠితమై 7 సం.లు నిండిన సందర్భంగా సప్తవ వార్షికోత్సవ కార్యక్రమాలు ఆగస్టు 14, 15 తేదీలలో ఘనంగా జరిగినవి.

ఆగస్టు 13వ తేదీ శుక్రవారం సాయంత్రం. పూజ్యులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారు, వారితోపాటు ఆశ్రమ కార్యకర్తలు శ్రీ శ్రీనివాస రావుగారు, వారి సతీమణి వచ్చారు. ఆగస్టు 13 సాయంత్రానికి ఆశ్రమ

ప్రాంగణంలో ఉన్న అన్ని దేవాలయాలకు విద్యుద్దీపాలంకరణ చేయడం వలన ప్రాంగణం అంతా దీపకాంతితో శోభాయామానంగా వెలుగొందింది.

14వ తేదీ శనివారం ఉదయం గం.5.15 ని.లకు కాకడ హారతి, అనంతరం శ్రీ వల్లిబోయిన శ్రీనివాసరావు గారు సమర్పించిన నూతన వస్త్రాలతో పూలమాలాలంకృతులైన ఆనంద సాయి ప్రభువారు దివ్య తేజస్సుతో దర్శనమిచ్చారు. ఉదయం గం.8.18 ని.లకు శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామానంద ప్రభుజీ వారి ఆధ్వర్యంలో ధ్వజారోహణ కార్యక్రమము వైభవోపేతంగా జరిగినది. గం.9.00లకు సాయిచాలీసా పారాయణ జరిగినది.

మరుసటి రోజు లక్ష పుష్పార్చన కార్యక్రమానికి, అలంకరణకు పూలు రావడంతో వాటిని సర్దిపెట్టడం, అలంకరణకి తీసుకొని వచ్చిన బంతి పూలను సాయిభక్తులు మాలలుగా తయారుచేయడం, సాయంత్రం గం.6.00 నుండి ఒకప్రక్క మామిడి తోరణాలు కట్టడం, బంతిపూల అలంకరణ, అరటి పిలకలతో ప్రధాన ద్వారం అలంకరణతో రాత్రి గం.1.00 అయ్యేసరికి పచ్చటి తోరణాలతో, బంతి పూలమాలలతో సాయి మందిరం శోభాయమానంగా తయారైనది. కార్యకర్తలు భక్తిశ్రద్ధలతో సాయి మందిరాన్ని అలంకరించారు. శ్రీ దరిపల్లి వెలిగొండయ్యగారు సమర్పించిన నూతన వస్త్రాలతో స్వామి వార్లందరికీ వస్త్రాలంకరణ జరిగినది. ఒకప్రక్క కార్యక్రమానికి ప్రసాదాలు తయారీతో దాదాపుగా 15వ తేదీ ఉదయం కార్యక్రమానికి సర్వం సిద్ధం చేసాము.

15వ తేదీ ఉదయం గం.5.15 ని.లకు కాకడ హారతి జరిగినది. అనంతరం గం.6.00లకు ఆనంద సాయి ప్రభు వారికి "సహస్ర ఘటాభి షేకానికి" సిద్ధం చేసి వచ్చిన భక్తులతో పూజారిగారు పూర్ణకుంభంతో పూజ్యులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారిని స్వాగతించి కార్యక్రమాలను ప్రారంభించవలసినది ప్రార్థించి, అతిథ్య భవనం నుండి భక్తులు సాయినామంతో వెంటరాగా, మంగళ వాయిద్య ధ్వనుల మధ్య





శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారిని వేదమంత్రాలతో ప్రదక్షిణగా రామాలయం మీదుగా బాబా వారి మందిరంలోకి సాదరంగా తీసుకొని వచ్చారు. సాయి మందిరం అభిషేకం చేయడానికి కలశాలతో వచ్చిన భక్తులతో కోలాహలంగా వున్నది. పూజారిగారు శాస్త్రోక్తంగా సంకల్పం చెప్పి, పూజ్యులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారిని సాయినాథుని పంచామృతాలతో అభిషేకించవలసిందిగా కోరారు. శ్రీరామానంద స్వామి వారు తమ కరకమలములతో పంచామృతాలను ఒక్కొక్కటిగా బాబా వారికి అభిషేకించారు. అనంతరం వచ్చిన భక్తులు తెచ్చిన కలశాలలోని జలం అభిషేకం చేసారు. సహస్ర కలశాలు పూర్తయ్యే వరకు ఆ సర్వదేవతా స్వరూపులైన ఆనంద సాయి ప్రభువారిని తనివితీరా, కన్నుల పండువగా భక్తులు అభిషేకం చేసారు. అనంతరం బాబా వారికి నూతన వస్త్రధారణ చేసి పూలమాలాలంకృతులను గావించి, వెండి కిరీటం అలంకరింపబడిన ఆనంద సాయి ప్రభువారు దివ్యతేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పూజారిగారు బాబా వారికి అష్టోత్తర శత నామ పూజ చేసారు.

ఉదయం గం.10.30 ని.లకు ఆనంద సాయి ప్రభు వారికి లక్ష పుష్పార్చన కార్యక్రమానికి సర్వం సిద్ధం చేసారు. లక్ష పుష్పార్చనలో పాల్గొన డానికి, చూడడానికి వచ్చిన భక్తులతో, లక్ష పుష్పార్చనకు వివిధ వర్ణ శోభిత పుష్పాలతో, పచ్చటి తోరణాలతో, బంతిపూల మాలల అలంకరణతో, దివ్య తేజస్సుతో కరుణామయమైన చూపులతో ఆనంద సాయి ప్రభు వారు చిరు దరహాసం చిందిస్తుండగా, మృదు గంభీర స్వరంతో శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పూజా విశిష్టతను, ఎవరి బాబా వారి పూజ చేయడానికి ఎవరు నోచు కుంటారో అటువంటి అదృష్టవంతులు మీరంతా అని శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారు పూజా విశిష్టతను వివరంగా చెప్తూ భక్తులచే పూజ చేయించారు. వేదికపై ఒకప్రక్క పూజారిగారు, మరోప్రక్క సాయిధామ ఆశ్రమ శ్రేయోభిలాషులు, కార్యకర్తలు శ్రీ శ్రీనివాసరావుగారు,

వారి సతీమణి సాయినాథుల వారికి అష్టోత్తర పూజ కావించి అనంతరం సహస్ర నామాలతో శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీ రామానంద ప్రభుజీవారు బాబా వారికి స్వర్చార్చన చేయుచుండగా వేదికపై కార్యకర్తలు అందించిన వివిధ రకాల పూలతో పూజారిగారు, శ్రీ శ్రీనివాసరావుగారి దంపతులు ఆనంద సాయి ప్రభువారికి పుష్పాభిషేకం చేసారు. చివరగా శ్రీశ్రీశ్రీ రామానంద ప్రభుజీ వారు తమ అమృతహస్తములతో ఆనందవదనంతో శ్రీ ఆనంద సాయి ప్రభు వారికి పుష్పాభిషేకం చేసారు. దాదాపుగా గంటసేపు జరిగిన ఈ లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని, బాబా వారిపై జాలువారుతున్న పుష్ప వర్షాన్ని భక్తులు తనివితీరా చూసి పులకితులయ్యారు. అనంతరం శ్రీ దరిపల్లి రామకోటయ్యగారు, సత్యవతి దంపతులు సమర్పించిన సుందరమైన బాబా వారి ఊయలను శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామానంద ప్రభుజీవారు ఆవిష్కరించి, ఊయల ఇచ్చిన దంపతులచే బాబా వారికి పూజ చేయించి, వారిని శాలువాతో సత్కరించి, ఎల్లప్పడూ సాయి సేవలో పునీతులు కావలసినదని వారిని ఆశీర్వదించారు.

అనంతరం శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారిని ఉద్దేశించి పూజారిగారు సభా పరిచయవాక్యాలు పలుకుతూ పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు పరమపదించిన తరువాత వారి ఆజ్ఞానుసారం సన్యసించి, సాయిదత్త పీఠాధిపతులై అనితర సాధ్యమైన ఒక గురుతర బాధ్యతను భుజాలకెత్తుకొని అకుంఠిత దీక్షతో సాయిధామం, సాయినాథ క్షేత్రం, శ్రీ కోదండరామ సాయి సన్నిధానం ఆశ్రమాలను అభివృద్ధిపథంలో నడిపిస్తున్న శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు వారి అనుగ్రహ భాషణం చేసారు అని అనడం అందరినీ ఆశ్చర్యపరచినది. బహుశా అక్కడ కూర్చున్న శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామానంద ప్రభుజీవారి స్థానంలో గురుదేవులు కనిపించారో ఏమో వారి నోటి వెంట అనుకోకుండా గురుదేవుల పేరు రావడం ముదావహం. గురుశిష్య బంధం ఎంత గొప్పదో ఈ సంఘటన తెలియజేస్తుంది. చిన్ననాటి నుండి గురువుని





చూస్తూ, గురు శుశ్రూష చేస్తూ, వారి ఆజ్ఞానుసారం నడుస్తూ, గురువు ఆశయాన్ని శ్వాసగా భావించి నడుస్తున్న శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారిలో (గురువే తానై తానే గురువైనట్లుగా) గురుశిష్యులు వేరు కాదు ఒక్కటే అనే భావన కలగడం అతిశయోక్తి కాదేమో. అనంతరం భక్తులనుద్దేశించి శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు తమ అమృత వాక్కులతో అనుగ్రహ భాషణం చేసారు. అనంతరం వచ్చిన భక్తులందరికీ శ్రీ రామానంద ప్రభుజీ వారు విభూతి బొట్టు పెట్టి ఆశీర్వదించారు. అనంతరం తీర్థప్రసాద వితరణతో కార్యక్రమం ఆనందోత్సాహాలతో ముగిసినది. ఈ కార్యక్రమానికి పులిహోర ప్రసాదానికి సరుకులు అందించిన శ్రీ పునార్జునరావుగారు, స్వీటు ప్రసాదానికి సరుకులు అందించిన శ్రీ శాత్రాసుపల్లి గోపీగారు, మంచినీళ్ళు అందించిన శ్రీ వీరాస్వామిగారు, కార్యక్రమం ఆసాంతం అలంకరణ, ప్రసాదాలు పంచడం మొదలైన కార్యక్రమాలలో నిలబడి సేవలందించిన ఆశ్రమ కార్యకర్తలకు మరియు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన భక్తులందరికీ శ్రీ ఆనందసాయి ప్రభు వారి కృపాకటాక్షాలు కలగాలని శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు తరఫున హృదయపూర్వకంగా కోరుకుంటున్నాము.

ఆగస్టు 20వ తేదీ ఆనంద సాయి ప్రభు మందిరంలో వరలక్ష్మీ వ్రతం ఘనంగా జరిగినది. వరలక్ష్మీ అమ్మ వారిని ఏర్పాటు చేసి, వచ్చిన భక్తులచే పూజారిగారు శాస్త్రోక్తంగా వ్రతం చేయించారు. ప్రసాద వితరణతో కార్యక్రమం ఆనందంగా ముగిసినది.

ఆగస్టు 24వ తేదీ పూజ్య మాతాజీ పంచమ ఆరాధనోత్సవం ఆశ్రమంలో ఘనంగా జరిగినది. పూజ, భజన, సత్సంగ కార్యక్రమాలతో మాతాజీ ఆశ్రమానికి చేసిన సేవలను, వారి త్యాగనిరతిని, ఒకసారి పున స్మరించుకొని నమస్కరించాము. ప్రసాద వితరణతో కార్యక్రమం ఘనంగా ముగిసినది.